క్లుప్తంగా

నేడు అప్పికొండమ్మ జాతర


కొలువుతీరిన అమ్మవారు

గొలుగొండ : పాతకృష్ణ దేవిపేట గ్రామంలో గురువారం అప్పికొండమ్మ జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ సత్యంనాయుడు, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎంతో పేరున్న ఈ అమ్మవారి జాతర గురువారం ఎంతో ఘనంగా నిర్వహించడం కోసం అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. విద్యుత్ అలంకరణ, బాణాసంచాతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేస్తున్నారు. తెల్లవారు నుండి అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలిరానున్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం


ఫైర్ సిబ్బందిని సన్మానిస్తున్న హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు

నర్సీపట్నం: బలిఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అగ్నిమాపకశాఖ వారు బుధవారం అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఫైర్ సిబ్బంది సూర్యప్రకాష్, తాతాజీ అగ్ని ప్రమాదాలు నాలుగు రకాలుగా సంభవిస్తాయన్నారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఫైర్ సిబ్బందిని హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐ.శ్రీనివాసరావు, తాతమరాజు, అప్పారావు, నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రోలుగుంట : నర్సీపట్నం డివిజన్ రోలుగుంట సెక్షన్ పరిధిలో గల 33/11 కె.వి. రోలుగుంట ఫీడర్‌లో ఆర్.డి.ఎస్.ఎస్ వర్క్‌లో భాగంగా బొడ్డేపల్లి నుంచి రోలుగుంట సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల19 న విద్యుత్ కోత ఉంటుందని నర్సీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి సాయింత్రం 4 గంటల వరకూ రోలుగుంట, కొమరవోలు, కొంతలం, కె.నాయుడుపాలెం, చెట్టుపల్లి, గురందొరపాలెం, నగరం, నిండుగొండ గ్రామల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన


రోలుగుంటలో ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

రోలుగుంట: పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ రోలుగుంటలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రూ.10 వేలు వేతనం ఇవ్వాలని వీకి ఆందోళనకు సారధ్యం వహించిన సీఐటీయూ మండల కారదర్శి కె.చిరంజీవి అన్నారు. ప్రతి నెలా కార్మికులకు జీతాలు చెల్లించి ఐడీ కార్డులు ఇవ్వాలని డిమాండు చేశారు 20 సంవత్సరాలుగా పని చేస్తున్న వారి పిల్లల విద్యార్హతల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట మహోత్సవం

మాడుగుల రూరల్: ఈ నెల 22వ తేదీ నుంచి శరనవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న దృష్ట్యా ముందస్తుగా కె.జె.పురం గ్రామంలో గల హౌసింగ్ కాలనీలో గురుభవానీ ఆదారి శేషు వారి ఇంటి వద్ద బుధవారం ఉదయం రాట వేశారు. ఈ నెల 22 వ తేదీన అమ్మవారిని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ముందుగా పసుపు, కుంకుమలు మహిళలు ఊరేగింపుగా తీసుకుని వచ్చి, రోటిలో దంచారు. కాగా గ్రామంలో పలువురు భవానీ మాలాధారణ చేశారు. గురు భవానీ ఆదారి శేషు, స్థానికులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం


కొలువుతీరిన కనకదుర్గ ఆలయ నూతన కమిటీ

నర్సీపట్నం: పట్టణంలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ బుధవారం ప్రమాణస్వీకారం చేసింది. చైర్మన్‌గా జె.నాగేంద్రరాజు, డైరెక్టర్లగా అల్లాడ మంగ, జి.శ్రీను, ప్రసాద్, గౌరి వరలక్ష్మి, వెంకట నరసింహమూర్తి, ఎం.అప్పలరాజు, రమణ, ఆర్.లక్ష్మి, కాంచన ప్రమాణస్వీకారం చేశారు. వీరిచే ఆలయ ఈవో సాంబశివరావు ప్రమాణస్వీకారం చేయించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, జనసేన నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

ఎరువు కరువు...కూటమిపై దరువు

- యూరియా పంపిణీపై మాయ మాటలొద్దు
- ప్రభుత్వ తీరుపై టీడీపీ సానుభూతి రైతుల మండిపాటు
- ఆందోళనకు సిద్ధమంటున్న వైనం


నాగాపురంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న కూటమి సానుభూతి రైతులు(ఫైల్)

గొలుగొండ : రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటు ఉంచాం.. ప్రతి రైతు కేంద్రం వద్ద యూరియాతోపాటు ఇతర ఎరువులు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదు అంటూ కూటమి నేతలు, వ్యవసాయశాఖ అధికారులు ప్రచారాలు చేయడం తప్ప ఎక్కడా సరిపడినంత ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు అందోళన చెందుతున్నారు. కూటమి సర్కార్ ఎరువులు పంపిణీ విషయంలో సాక్షాత్తూ తెలుగుదేశానికి చెందిన సానుభూతి రైతులు గొలుగొండ మండలం నాగాపురంలో సోమవారం ఆందోళన చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు ఆందోళన చేయడంపై అధికారులు, స్థానిక తెలుగుదేశం నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఎరువులు కొరత లేదని ప్రచారం చేస్తుంటే తమ పార్టీకి చెందిన వారే ఎరువులు లేవని గ్రామ సచివాలయం వద్ద ఆందోళన చేయడంతో కూటమి సర్కార్ పరువు కాస్త పోయిందని అంటున్నారు.

పొంతన లేని లెక్కలు

మండలంలో ఉన్న సాగు భూములకు 281 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ప్రతి ఏటా జూన్ రెండో వారం నుండి వీటిని రైతులకు అందుబాటులో ఉండాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముందుగానే ఎరువులు అందుబాటులో ఉండడం వల్ల రైతులకు నాట్లు వేయడానికి ఇబ్బందులు ఉండేవి కావు. కానీ ఉప్పుడు కూటమి సర్కార్ పాలనలో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై వ్యవసాయ అధికారులు లెక్కలు తప్పుగా చెప్పడం జరుగుతుందని రైతులు అంటున్నారు. మండలంలో 20 వరకు రైతు కేంద్రాలు, అలాగే 8 లైసెన్సు షాపుల ద్వారా వారం రోజుల క్రితమే 271 మెట్రిక్ టన్నుల ఎరువులు అమ్మకాలు జరిగాయని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికే 95 శాతం ఎరువులు రైతులు అందిస్తే గ్రామాల్లో రైతులు ఎందుకు అందోళన చేస్తారని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. నాలుగు రోజులు క్రితం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు వ్యవసాయశాఖ అధికారుల తీరుపై మండిపడ్డారు. రైతులకు సకాలంలో ఎరువులు ఎందుకు అందించలేదని ఆరోపించారు. ప్రతి రైతు కేంద్రం వద్ద 20 బస్తాల ఎరువులు తీసుకువచ్చి అక్కడ ఉన్న కూటమి నేతలకు ఇద్దరు ముగ్గురికి ఎరువులు అందించినట్లు ఫొటోలు తీసుకుంటున్నారు. ఎరువుల కొరత లేదని అధికారులు సమక్షంలో నేతలు ప్రచారాలు చేస్తున్నారు.

కొరత లేకుండా చర్యలు

మండలంలో ఉన్న రైతులకు కొంతమేర ఎరువులు కొరత ఉందని వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. నాగాపురంలో 12 మెట్రిక్ టన్నుల ఎరువులకుగాను ఇప్పటి వరకు 6 టన్నుల ఎరువులు అందించడం జరిగిందన్నారు. మిగతా పంచాయతీలో ఎరువులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం కోసం ఉన్నాధికారులకు నివేదిస్తామన్నారు.

ఆందోళనకు రంగం సిద్ధం

మండలంలో రైతులు ఎరువుల కొరత రోజు రోజుకి పెరిగిపోవడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళన సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. అధికారులు, కూటమి సర్కార్ తప్పుడు ప్రచారాలు మానుకోవాలని రైతులు తెలుపుతున్నారు. 271 మెట్రిక్ టన్నుల ఎరువులు అందిస్తే రైతులకు ఇబ్బందులు ఉండే పరిస్థితి లేదు. కానీ తప్పుడు లెక్కలతో రైతులను మాయ చేస్తున్నారని, దీని వల్ల వేసిన నాట్లకు ఎరువులు లేక ఎదుగుదల లేకుండా పోతుందని అంటున్నారు. ఇప్పటి వరకు అధికార పార్టీలో ఉండడంతోనే రోడ్డు ఎక్క లేకపోతున్నామని ఆందోళన చేసి ఎరువులు తీసుకోకపోతే పంటలు నాశనం అవుతాయని రైతులు అంటున్నారు. నాగాపురంలో అధికార పార్టీకి చెందిన యర్రా వరహాలు, పోకనాట భూషణం, కొలగాన రామకృష్ణ,నాగ సత్యన్నారాయణ, త్రినాద్ ఆందోళన చేయడంతో మిగతా పంచాయతీల్లో ఉన్న కూటమి సర్కార్‌కు అనుకూలంగా ఉన్న రైతులు ఆందోళన చేస్తామని తెలుపుతున్నారు.

అరకొర యూరియా సరఫరాతో ఇక్కట్లు


జి. అగ్రహారం సచివాలయం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

మాడుగుల రూరల్: జి. అగ్రహారం సచివాలయం వద్ద యూరియా విక్రయంలో బుధవారం గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ సచివాలయంలో వీరనారాయణం గ్రామానికి చెందిన రైతులకు 80 బస్తాలు అందజేయాల్సి ఉండగా, గ్రామానికి చెందిన 300 మంది రైతులు తమ ఆధార్, భూమి పాసుపుస్తకం, జెరాక్స్ కాపీలను ఈ నెల 15 వ తేదీన లైన్‌లో పెట్టారు. వీరనారాయణం, జి. అగ్రహారం రెండు సచివాలయాలు కలిపి క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. ఈ రెండు సచివాలయాల పరిధిలో వీరనారాయణం, జి. అగ్రహారం, చింతలూరు, గ్రామాలు వున్నాయి. ఈ రెండు సచివాలయాలకు కలిపి 240 బస్తాలు యూరియా రావడంతో, ఒక్కో గ్రామానికి 80 బస్తాలు చొప్పున కేటాయించారు. మంగళవారం చింతలూరు గ్రామానికి చెందిన రైతులకు 80 బస్తాలు యూరియా అందజేయగా, బుధవారం వీరనారాయణం గ్రామానికి చెందిన రైతులకు యూరియా అందజేయాలి. కాగా ఈ గ్రామానికి చెందిన సుమారు 300 మంది రైతులు తమ ఆధార్, భూమి పాసుపుస్తకం జెరాక్స్ కాపీలను ఈ నెల 15 వ తేదీన లైన్‌లో పెట్టారు. వరుస క్రమంలో పిలవకుండా సచివాలయ సిబ్బంది, అనాధికార వ్యక్తులు కలిసి తాజాగా బుధవారం లైన్‌లో పెట్టిన వారికి యూరియా బస్తాలు పంపిణీ చేశారని రైతులు కాళ్ల బాలకృష్ణ, దాడి ముత్యాలు నాయుడు, బొడ్డేడ గోదారయ్య, బొడ్డేడ కళ్యాణం, మళ్ల అప్పారావు, పీలా ముత్యాలునాయుడు, దాడి ఎరుకునాయుడు, ఎ. రాజు, కోండారావు తదితర రైతులు ఆరోపించారు. మూడు రోజుల పాటు సచివాలయం చుట్టు యూరియా కోసం తిరిగామని, అయినా సరే యూరియా దొరకలేదని వాపోయారు.

నానో యూరియాపై డ్రోన్‌తో క్షేత్ర ప్రదర్శన


కొమరవోలు గ్రామంలో నానో యూరియాపై డ్రోన్ ప్రదర్శన

రోలుగుంట: కొమరవోలు గ్రామంలో బుధవారం నానో యూరియా, వ్యవసాయంలో డ్రోన్ ప్రాముఖ్యతపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రసాయనిక ఎరువులకు ప్రత్యమ్నాయంగా నానో యూరియా నానో డీఏపీ ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది. రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులను వినియోగించి, నత్రజని, భాస్వరం, పొటాస్‌కు ప్రత్యమ్నాయంగా ఉపయోగించొచ్చని నర్సీపట్నం సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీదేవి తెలిపారు. నానో కార్యక్రమంలో డిఆర్‌సి ఏటప ఝాన్సీలక్ష్మి, ఏవో విజేత, డీఆర్‌సీ అనకాపల్లి వ్యవసాయాధికారి చిరంజీవి, ఆత్మ బీటీఎం లక్ష్మీ కిశోర్, విహెచ్‌ఏ నీలవేణి, కార్తీక్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం


కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ అనుషా


కింతలి పీహెచ్‌సీలో శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీపీ రాజారామ్


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రసన్నకుమార్


దేవరాపల్లిలో పీహెచ్‌సీలో వైద్య శిబిరం


కె.కోటపాడు సీహెచ్‌సీలో..

నర్సీపట్నం: మండలంలో వేములపూడి పీహెచ్‌సీ వారు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సుకల రమణమ్మ, నూకాలమ్మ, ఎంపీటీసీ బోళెం రాంప్రసాద్, డాక్టర్ అనుషా, డాక్టర్ సుమ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్లు కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గురించి వివరించారు. ఐదేళ్ల లోపు పిల్లలకు విధిగా టీకాలు వేయించాలని, యుక్త వయస్సు గల బాలికలు రక్తహీనత లేకుండా మంచి పోష్టికాహారం తీసుకోవాలన్నారు. రుతుక్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్త్రీలకు వచ్చే వాధ్యులు, క్యాన్సర్లపై పరీక్షలు నిర్వహించారు.

మాడుగుల రూరల్: కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్ బుధవారం ప్రారంభించారు. వైద్యాధికారులు రోబ్బా సోముదొర, తలారి శ్రీను సారథ్యంలో జరిగిన ఈ శిబిరంలో 109 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. మైచర్ల భవానీ, మైచర్ల సన్యాసిరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉందూరు దేముడు పాల్గొన్నారు.

దేవరాపల్లి: స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మహిళల ఆరోగ్యం కోసం బుధవారం ప్రత్యేకంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో అంకాలజిస్ట్ డా.ఎం. నవ్య, డా.హేమలత, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ఈ.పూజ్యమేఘన, డా.డి.వనజ, ఆయుర్వేద డాక్టర్ గ్రీష్మ తదితరులు వైద్య సేవలందించారు. ఈ వైద్య శిబిరంలో 324 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

నాతవరం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన స్వస్త్ నార్ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించామని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలో మర్రిపాలెం గ్రామంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు.

గొలుగొండ: గొలుగొండలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొలుగొండ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే నెల 2 తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యవంతమైన మహిళ– శక్తివంతమైన కుటుంబం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మహిళల్లో గుండెజబ్బులు, మధుమేహం నోటి క్యాన్సర్, గర్భాశయ వ్యాధులపై పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు.

కె.కోటపాడు : మహిళల్లో వచ్చే అనారోగ్య సమస్యలకు ప్రాథమిక దశలోనే మెరుగైన వైద్యం పొందాలని కె.కోటపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి అన్నారు. ఆస్పత్రిలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 125 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలను జరిపి ఉచితంగా మందులను అందించారు. వైద్యులు కోటేశ్వరరావు, ఆర్.రమ, జి.వైదేహి, పి.విజయలక్ష్మి, ఎం.మహేష్, రోజారాణి, కుసుమరాణి పాల్గొన్నారు.

మాకవరపాలెం: మెగా వైద్య శిబిరంలో 332 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని బూరుగుపాలెం పీహెచ్‌సీ వద్ద బుధవారం స్వస్థ నారీ – సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 332 మందికి సాధారణ వ్యాధులతోపాటు క్యాన్సర్ లక్షణాలపై పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరాన్ని ఎంపీపీ సర్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు యర్రాపాత్రుడు, సర్పంచ్ రమణ పర్యవేక్షించారు. బూరుగుపాలెం, మాకరపాలెం పీహెచ్‌సీల వైద్యులు చరిష్మ, చరణ్, సీతారామలక్ష్మితోపాటు ప్రత్యేక వైద్య నిపుణులను పరీక్షించారు.

మాడుగుల రూరల్ : ఆరోగ్య సంరక్షణకు ప్రతి మహిళ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ జామి రమణబాబు పేర్కొన్నారు. స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కె.జె.పురం పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం వైద్యశిబిరం ప్రారంభించారు. వైద్యాధికారులు డాక్టర్ ప్రసాదుపాత్రుడు, డాక్టర్ సందీప్, ఆయుష్ వైద్యాధికారిణి శ్రీదేవి 278 మందిని పరీక్షించి మందులు అందజేశారు. పోషకాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి సుజాత, పీహెచ్ఎన్ ఇందిర, ఆరోగ్య పర్యవేక్షకులు వెంకట్రావు, పుష్పకాంతం, టీబీ పర్యవేక్షకులు ఈశ్వరరావు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు,అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కాగా గురువారం కె.జె.పురంలో1వ సచివాలయం ఆవరణలో వైద్య శిబిరం నిర్వహిస్తామని వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు తెలిపారు.

రోలుగుంట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బుధవారం వైద్యులు మహిళల ఆరోగ్యం కోసం 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' పథకం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి శ్రావణి, వైద్యులు మజీదా బేగం, ఎల్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ మహిళ ఆర్యోగం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందని అన్నారు.

మాడుగుల: మహిళలు ఆరోగ్యకరంగా ఉండడానికే కేంద్రం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ చేపట్టిందని సీహెచ్‌సీ సూపరింటిండెంట్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం30 పడకల ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎంపీపీ వెంకటరాజారామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పలరాజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కాసుబాబు, ఝాన్సీ, వైద్యాధికారులు నరేష్, రాజుకుమార్, నాయుడు, హెడ్ నర్స్ ప్రసన్న, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరా సంబరాలకు పసుపురాట



మాడుగుల: దసరా ఉత్సవాలు పురస్కరించుకుని శ్రీదేవి ఆలయం ముంగిట బుధవారం ఏకాదశి సందర్భంగా చలువ పందిళ్లు వేయడానికి పసుపు రాట వేశారు. వచ్చే నెల 2 వ తేదీ దసరా ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ తెలిపింది. దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాటు సిద్ధం చేస్తున్నామని, ఆలయ కమిటీతో పాటు గ్రామపెద్దలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో విశ్వకర్మ జయంతి



దేవరాపల్లి: దేవరాపల్లి మండల వ్యాప్తంగా విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెదనందిపల్లి, ఎం.అలమండ, చిననందిపల్లి, వేచలం, నాగయ్యపేట, సీతంపేట గ్రామాలలో విశ్వబ్రహ్మణులు వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన, ప్రసాద వితరణ చేశారు.

విజయదుర్గ శక్తి పీఠంలో భవానీ దీక్షలు

రావికమతం: వమ్మవరంలోని శ్రీవిజయదుర్గ శక్తి పీఠంలో సుమారు 100 మంది దుర్గమ్మ భక్తులు బుధవారం అర్ధ మండలం (21రోజులు) భవానీ మాలలు వేసి దీక్ష ప్రారంభించారు. భక్తులకు శక్తి పీఠం పురోహితులు, గురుభవానీ ధర్మఫణి మాలాధారణ చేశారు. ఆలయ ధర్మకర్త చౌదరి అన్ని ఏర్పాట్లు చేశారు. ధర్మకర్త అధ్వర్యంలో ప్రతి ఏటా దేవి నవరాత్రుల్లో భవానీ భక్తులకు ఉచితంగా అల్పాహారం, మధ్యాహ్నం భిక్ష వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారని పురోహితులు ధర్మఫణి తెలిపారు.

శాంతియుత ర్యాలీని విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గురువారం తలపెట్టిన శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు, పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నంకు మెడికల్ కాలేజీ ఇచ్చారన్నారు. ఇటు ప్రజలు అటు విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం నీరు గార్చిందన్నారు. ప్రజలను దోపిడీ చేసేందుకు కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఆందోళనను వివిధ రూపాల్లో తీవ్రతరం చేస్తామన్నారు. మెడికల్ కాలేజీని కాపాడుకునేందుకు అందరూ ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ పిలుపునిచ్చారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకారం


ఎంపీడీవోను సన్మానిస్తున్న ఎంపీపీరాజు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మినాయుడు


ఎంపీడీవో శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది

రావికమతం: రావికమతం మండల ఎంపీడీవోగా ఒ.మహేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన వెంకన్నబాబు జూలైలో పదవీ విరమణ చేశారు. మండల పరిషత్ ఏవో సీతారామస్వామి ఎంపీడీవో(ఎఫ్ఏసీ)గా వ్యవహరించారు. సబ్బవరం మండలం ఈవోపీఆర్డీగా పనిచేస్తూ అల్లూరి జిల్లా జి.కె.వీధి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా వ్యవహరిస్తున్న మహేష్ తాజాగా పదోన్నతిపై రెగ్యులర్ ఎంపీడీవోగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎంపీపీ పైల రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎంపీడీవో మహేష్‌ను ఎంపీపీతో పాటు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయు డు, ఎంపీటీసీ సభ్యులు పూడి దేవా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నాతవరం ఎంపీడీవోగా శ్రీనివాస్

నాతవరం : మండల పరిషత్ కార్యాలయం ఎంపీడీవోగా శ్రీనివాస్ బుధవారం భాద్యతలు స్వీకరించారు,ఇక్కడ పని చేసిన ఎంపీడీవో హనుమంతరావును గత ఏడాది కూటమి ప్రభుత్వం బదిలీ చేసింది, అప్పట్నుంచి రెగ్యులర్ ఎంపీడీవోను నియమించకపోవడంతో ఇంతవరకు నర్సీపట్నం ఎంపీడీవో ఉషాశ్రీ ఇంచార్జి ఎంపీడీవోగా పని చేస్తున్నారు. రెగ్యులర్ ఎంపీడీవోగా ఉపాధి హామీపథకంలో జిల్లా కేంద్రంలో పని చేస్తున్న శ్రీనివాస్‌ను నియమించారు. ఆయన బాధ్యతలు స్వీకరించడంతో ఎంపీపీ లక్ష్మణమూర్తి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


బుచ్చెయ్యపేట ఎంపీడీవో కె.శివప్రసాద్ నారాయణ

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట ఎంపీడీవోగా కె.శివ ప్రసాద్ నారాయణ బాధ్యతలు స్వీకరించారు. సబ్బవరం మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఎంపీడీవోగా పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. బుధవారం విధుల్లో చేరడంతో పలువురు అధికారులు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు కలిసి అభినందనలు తెలిపారు.

ఈ ఏడాది 50వేల మొక్కల పెంపకం


అటవీ హక్కు పత్రాలపై రేంజరు రాజేష్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం : పెడిమికొండ అటవీ నర్సరీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నామని నర్సీపట్నం అటవీశాఖ రేంజరు రాజేష్ అన్నారు. ఆయన బుధవారం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తిని ఎంపీడీవో కార్యాలయంలో కలిసి సరుగుడు సుందరకోట కె.వి. శరభవరం, చమ్మచింత పంచాయతీలలో గల గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీ భూముల పట్టాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గిరిజనులకు పట్టాలు పాసుపుస్తకాలు పంపిణీ చేయగా మిగిలిన లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీపోడు భూములకు పట్టాలు ఇస్తామన్నారు. నర్సీపట్నం తుని అర్‌అండ్‌బీ రోడ్డును అనుకుని ఉన్న పెడిమికొండ అటవీ నర్సరీలో ఈ ఏడాది 200 దిమ్మలపై సుమారుగా 50వేల వివిధ జాతులు మొక్కలు పెంచుతున్నామన్నారు. ఈ ఏడాది పెంచే మొక్కలు వచ్చే ఏడాది పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అటవీ సెక్షన్ అధికారి చిరంజీవి సిబ్బంది ఉన్నారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు


ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు అందిస్తున్న సత్యనారాయణమూర్తి, గంగాధర్

కె.కోటపాడు: దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను కె.కోటపాడులో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా జరిపారు. కోటపాడు సీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెల పంపిణీ చేశారు. మాజీ డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కె.కోటపాడు అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను జరిపారు. విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ ఏర్పాటు చేసిన జన్మదిన కేక్‌ను మాజీ వైస్ చాన్స్‌లర్ ముర్రు ముత్యాలనాయుడు కట్ చేసి విద్యార్థులకు అందించారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

మాకవరపాలెం: ప్రధాని మోదీ జన్మదినాన్ని బిజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చెత్తను తొలగించారు. సీతన్నఅగ్రహారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మాకవరపాలెం, పైడిపాల, సీతన్నఅగ్రహారం పాఠశాలల్లో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మర్రి నాయుడు, బాబూరావు, ఉపాధ్యక్షుడు రుత్తల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ రాంబాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

వరిలో అగ్గి తెగులు పట్ల అప్రమత్తం


దేవరాపల్లి వరి పంటను పరిశీలిస్తున్న ఏవో ఎల్‌వై. కాంతమ్మ

దేవరాపల్లి: వరి పంటలో అగ్గి తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఎల్‌వై. కాంతమ్మ సూచించారు. మండలంలోని దేవరాపల్లిలో సహ పలు గ్రామాలలో బుధవారం ఆమె వరి పంటను పరిశీలించారు.వరి పంటను అగ్గి తెగులు సోకినట్లు గుర్తించామని ఏవో ఎల్‌వై కాంతమ్మ తెలిపారు. ఈ తెగులు సోకిన పంటలో ఆకులపై మచ్చలుగా ఏర్పడి, మచ్చ చుట్టూ ఎర్రగా ఉండి, మచ్చ లోపల తెల్లగా ఉంటుందన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే తెగులు నివారణకు 100 గ్రాముల ట్రైసైక్లాజోల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. అలాగే వరి పంటలో పొటాషియం లోపం కూడా ఉన్నట్లు గుర్తించామని ఏవో కాంతమ్మ తెలిపారు.